# పొరపాటు ఖరీదు

సాయంత్రం ఆరు గంటల సమయం.

కమలాకరం ఇంటి ముందు తోటలో కేన్ ఛెయిర్లో కూర్చుని మేగజైన్ చదువుకుంటున్నాడు!

సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకోవాలని తొందర పడుతున్నాడు. మబ్బులు ఆకాశ రంగాన నర్తించ డానికై ముస్తాబు చేసుకుంటున్నాయి. గూళ్ళకు చేరు కునే పక్షుల కలరవాలు మధుర సంగీతంలా వుంది! ప్రక్కనే వున్న సన్నజాజి పందిరిపైన విచ్చిన పూలు సువాసనల్ని వెదజల్లుతూ పరిసరాల్ని పరిమళభరితం చేస్తున్నాయి.

అటువంటి ఆహ్లాదకర వాతావరణంలో - తోటలో ఒంటరిగా కూర్చుని చదువుకోవడం కమలాకరానికి ఇష్టం!

ఈ రోజు కూడా అటువంటి వాతావరణంలో — ఆనందాన్ని అనుభవిస్తున్న తరుణంలో —

"నాన్నా!" అన్న పిలుపు వినబడిందాయనకు.

తలెత్తాడు కమలాకరం.

ఎదురుగా కొడుకు రమేష్.

"పుస్తకం చదువుకుంటున్నారా!" తండ్రి ఎదు రుగా వున్న కుర్చీలో తీరుబడిగా కూర్చున్నాడు.

కమలాకరం ఆశ్చర్యపోయాడు.

"రమేష్! ఈ రోజు హాస్పిటల్‌కి వెళ్ళలేదే?"

"ఇవ్వాళ ఇంట్లో వుండాలనిపించింది..." నవ్వుతూ అన్నాడు.

కొడుకు సాంతం వింతగా తోచింది. కొడుకు మెడిసిన్ పాసయి హాస్పిటల్లో డాక్టర్‌గా చేరాక ఏనాడూ ఇంత తీరుబడిగా కూర్చోలేదు. పట్టుమని పది నిమిషాలు తనతో మాట్లాడడం అరుదైపోయింది. ఇప్పుడు తనకు పుస్తకాలు... రేడియో... టి.వి.నే కాలక్షేపం ... ఇవ్వాళ... ఇంత తీరుబడిగా కూర్చున్నాడంటే ఏదో విశేషం వుంది! ... అను కుంటూ చేతిలోని పుస్తకం టేబిల్‌పై పెట్టేశాడు.

"నాన్నా! చాలా రోజుల్నుంచి మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను..." సందేహిస్తూ అన్నాడు రమేష్.

"ఏమిటది?"

క్షణం ఆగి మెల్లగా అన్నాడు — "నేనొక అమ్మాయిని ప్రేమించాను... ఆ అమ్మాయి, నేను కలిసి చదువుకున్నాం!"

కొడుకు "ప్రేమించాను" అనగానే కమలాకరం ముఖంలో... వింత వెలుగు కనబడింది.

"నిజంగానా!" నవ్వుతూ అడిగాడు.

తండ్రి ఆనందానికి రమేష్‌కి ఆశ్చర్యం కలిగింది. సాధారణంగా తండ్రులు కొడుకుల ప్రేమల్ని సహించుకోరు. ఒకవేళ మొదట్లో అమ్మాయి వివ రాలు చెప్పి ప్రాధేయపడితే... లేక బెదిరిస్తే... ఒప్పు కుంటారు. అటువంటిది తండ్రి తను చెప్పిన వెంటనే అంగీకరించడం రమేష్‌కి వింతగా తోచింది.

"ఇంతకీ ఆ అమ్మాయి ఎలా వుంటుందో చెప్పనే లేదు!" అన్నాడు కమలాకరం.

తండ్రి ప్రోత్సాహం రమేష్‌కి చాలా ఉత్సాహం కలిగించింది. "ఉండండి నాన్నా! ఆ అమ్మాయి ఫొటో వుంది తీసుకొస్తాను."

రమేష్ లోపలకు పరుగెట్టాడు.

కొడుకు మాటలు కమలాకరం మనసులో సంచల నాన్ని కలిగించాయి. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనే సిద్ధాంతం తనది. పాతికేళ్ళ క్రితం నాటి ఆ కోరిక... తనకు తీరనే లేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ తన కొడుకు తన అడుగుజాడల్లోనే నడవడం... కమలాకరానికి చాలా ఆనందం కలిగిస్తోంది. తన కెలాగూ ఆ [illegible] రమేష్ కోరికైనా... తీర్చాలి!

"[illegible]దుగో నాన్నా! అమ్మాయి ఫొటో!" అందిం చాడు.

కమలాకరం ఆ ఫొటో చూశాడు. అమ్మాయి అందంగా వుంది. కానీ... ఆ ప్రక్కన... చెంపట గాలి ముఖాన కొట్టినట్లయింది.

"నాన్నా! అమ్మాయి బాగుందా!" రమేష్... అడిగాడు.

కానీ కమలాకరం ఆ అమ్మాయిని చూడడం లేదు.

"రమేష్! ఈ అమ్మాయి ప్రక్కన వున్న ఆవి డెవరు?"

"ఆవిడా! అమ్మాయి తల్లి... మాధవీలత..."

ఆ పేరు వినగానే కమలాకరానికి గుండె ఝల్లు మన్నట్లయింది. నరాలు జివ్వుమన్నాయి. అరవై ఏళ్ళ శరీరంలోకి మళ్ళీ యవ్వనం వచ్చినట్లుంది! మనసంతా వింత అనుభూతితో నిండిపోయింది.

ఆనాటి పేరు...

తన మనస్సులో ప్రేమ జలపాతం ప్రవహింపచేసిన పేరు.

తన కళ్ళల్లో వెన్నెల వర్షాన్ని కురిపించిన రూపం. మాధవీలత...

ఎక్కువ మారలేదు. కొద్దిగా లావయింది. అంతే!

"రమేష్! ఈ అమ్మాయి తండ్రి ఏడీ?"

"ఆ అమ్మాయి చిన్నప్పుడే పోయారుట నాన్నా! తల్లే చాలా కష్టపడి కూతుర్ని చదివించిందట!"

"అలాగా!" సాలోచనగా అన్నాడు!

"అమ్మాయి ఎలా వుంది నాన్నా!"

"చాలా బాగుంది! అంతా తల్లి పోలికే! వాళ్ళని ఒకసారి మనింటికి తీసుకురా! మిగతా విషయాలు మాట్లాడుదాం!"

"అలాగే నాన్నా!" రమేష్ ఆనందంతో పొంగి పోయాడు! కమలాకరం ఆ ఫొటోని చూస్తూ కూర్చుండిపోయాడు!

* * *

"ఆంటీ!"

"ఒరేయ్! కమలాకరం... ఎవరో పిలుస్తున్నారు చూడు!" అక్క జానకి వంటింట్లో నుండి అరిచింది!

గదిలో మంచం మీద పడుకుని చదువుకుంటున్న కమలాకరం అక్క మాటలు విని బయటికి వచ్చాడు!

హాల్లో మెరుపుతీగలాటి అమ్మాయి.

ఆ అందానికి అచ్చెరువొందాడు కమలాకరం.

"ఆంటీ వుందాండీ!"

వంటింట్లోకి పరుగెట్టుకొచ్చాడు కమలాకరం.

"అక్కా! ఎవరో అమ్మాయి నీ కోసమే!"

"ఎందుకో కనుక్కో! నేను పనిలో వున్నాను" అంది కూర కలియ పెడ్తూ!

"అదేమిటో నేను చూస్తానా! నువ్వెళ్ళు" జానకి చేతిలోని గరిటె అందుకున్నాడు కమలాకరం.

జానకి వచ్చింది.

"లెక్చెరరు ఉద్యోగం చేస్తున్నా మొహమాటం పోలేదురా!" అంటూ బయటకెళ్ళింది.

పావుగంట తర్వాత మళ్ళీ వంటింట్లోకి వచ్చింది.

"మన ఎదురింటమ్మాయి. ఏం తోచడం లేదుట. ఏవైనా పుస్తకాలు కావాలంటూ వచ్చింది."

"ఆ అమ్మాయి పేరు లతట... పేరులానే అమ్మాయి కూడా బాగుంది కదూ!"

"వూ!"

గబగబా వరండాలోకి వచ్చాడు!

ఆ అమ్మాయి ఎదురింటి గేటు తీసుకుని లోప లకు వెడుతోంది.

ఆ తర్వాత లత తరుచూ పుస్తకాల కోసం వచ్చేది! ఆమె వచ్చే టైముకు కమలాకరం ఇంట్లో వుండేవాడు

—విన్నకోట సుశీలాదేవి

కాదు. లత వచ్చిందని తెలిస్తే మాత్రం తన టైముకు లేకపోయినా అని బాధపడిపోయేవాడు!

ఒక రోజు...

లత వచ్చే టైముకు కమలాకరం ఇంట్లోనే వున్నాడు.

జానకి పక్కింటావిడతో కలిసి సినిమాకు వెళ్ళింది!

"ఆంటీ!"

ఆ అమ్మాయి లోపలికొ ంది!

"రండి"

"ఆంటీ లేదా?"

"ఊహూ... సినిమాకు వెళ్ళింది!"

ఆ అమ్మాయి వెనుదిరగబోయింది.

"అరె... వెళ్ళిపోకండి... మీరొస్తే పుస్తకాలిమ్మని నా కిచ్చి వెళ్ళింది!" అబద్ధమాడాడు కమలా కరం.

లత సోఫాలో కూర్చుంది.

కమలాకరం ఆమె వేపు చూశాడు. నీలం రంగు కాటన్ చీర... అదే రంగు బ్లౌజులో ఈ రోజు మరీ బాగుంది... అనుకున్నాడు.

ఆమెతో మాట్లాడాలనిపించింది. ధైర్యం తెచ్చుకున్నాడు.

"మీ పేరు?" తెలిసినా మళ్ళీ అడిగాడు.

"లత"

"చదువుకుంటున్నారా?"

"డిగ్రీ పూర్తయింది!"

"నా పేరు కమలాకరం. ఎం.ఎ. పాసయ్యాను. విజయవాడలో లెక్చరరుగా పని చేస్తున్నాను. ప్రస్తుతం ఎం.ఫిల్. సమ్మర్ కోచింగ్ కోసం వైజాగ్ వచ్చాను!"

"మీరు లెక్చరరా? ఇంకా చదువుకుంటున్నారను కుంటున్నాను!" అంది ఆశ్చర్యంగా.

నవ్వేశాడు కమలాకరం.

"ఒక రకంగా నేనింకా విద్యార్థినే. ఈ ఎం.ఫిల్. తర్వాత పి.హెచ్‌డి. చెయ్యాలనుకుంటున్నాను."

"అబ్బ! నాకి డిగ్రీ చదువుతోనే విసుగొచ్చింది. ఎలాగైనా మీకు చాలా ఓపిక..."

"మీలాంటి సుకుమారులు అంతకంటె ఎక్కువ కష్టపడితే... బాగుండదు..." తన కాంప్లిమెంటు ఆమె కేదైనా కోపం తెప్పించిందేమో అనుకున్నాడు. ఆమె ముఖం ప్రసన్నంగా వుండడం చూసి ఉత్సాహం తెచ్చుకున్నాడు.

"ఈ విశాఖపట్నం వాతావరణమంటే నాకు చాలా ఇష్టం. నేను ఎం.ఎ. ఇక్కడే చదివాను. ఎం.ఫిల్. చేయడానికిక్కడా అదొక కారణం; ఆ వంకతోనైనా కొద్ది కాలం ఇక్కడ వుండొచ్చని! ఈ విషయంలో మీరు చాలా అదృష్టవంతులు" అన్నాడు.

"అబ్బే! మాది ఊరు కాదు. మా బాబాయికి నేవీలో ఉద్యోగం. కొద్ది రోజులుందామని వచ్చాము అంతే!"

"అయితే మీ ఊరేది!"

"మా నాన్నగారికి కడప ట్రాన్స్‌ఫరయింది. ప్రస్తుతం సెలవులో వున్నారు. ఇంకో వూరు మార్పించుకోవాలని చూస్తున్నారు. ఏమవుతుందో?"

ఇంతలో జానకి సినిమా నుండి రావడంతో వాళ్ళ సంభాషణ ఆగిపోయింది. కొద్దిసేపు జానకితో మాట్లాడి పుస్తకాలు తీసుకుని వెళ్ళి పోయింది లత!

గుర్తు పెట్టుకుంటారు కదూ" జానకి లేకుండా చూసి మెల్లగా అడిగాడు.

"మరి... మీరో... నన్ను మర్చి పోతారా?" చిన్నగా నవ్వింది!

"అది ఈ జన్మకు అసాధ్యం లతా" అంటూ ఆమె చేతిని పట్టుకున్నాడు.

"మళ్ళీ ఎప్పుడు మీ దర్శనం" కళ్ళల్లోకి చూస్తూ



తర్వాత నుండీ లత వచ్చిన సమయాల్లో కమలాకరం ఇంట్లోనే వుండడం మొదలెట్టాడు. ఆమె రాక కోసం ఎదురు చూడడం అతని దిన చర్యలో ఒక భాగమైంది. జానకి వున్నా తనూ వచ్చికూర్చుని ఆమెతో మాట్లాడేవాడు. ఆ కబుర్లలో ఎన్నో విషయాలు దొర్లేవి.

అయితే మనసులో ఎంత ఆరాటంగా వున్నా ఆమెతో ఏకాంతంగా మాట్లాడే అవకాశం కలగలేదు. చొరవ తీసుకోవాలని వున్నా ఆమె ఏమనుకుంటుందోనని బిడియ పడ్డాడు.

వేసవి సెలవులు అయిపోయాయి. మళ్ళీ కాలేజీలు తెరిచారు. కమలాకరం తిరిగి విజయవాడ వెళ్ళే రోజు ఆసన్నమైంది.

కమలాకరం ఆ విషయం చెప్పగానే లత ముఖంలో నీలి నీడలు వ్యాపించాయి.

"అప్పుడేనా?" అప్రయత్నంగా అంది!

ఆ మాటతో కమలాకరంలోని సంకోచం పటా పంచలైంది. ఆమెకు తనపైగల భావం అవగతమైంది! అతని మనస్సులో ఆనంద కెరటం వువ్వెత్తున లేచింది.

"మీరింకా ఎన్నాళ్ళుంటారు?" అనడిగాడు.

'ఇంకో పది హేను రోజులుంటాము. బహుశ వచ్చే వారంలో మా నాన్నగారికి ఆర్డర్లు రావచ్చు."

'నేను రేపు రాత్రి ట్రెయిన్‌కే వెళుతున్నా నన్ను

అడిగాడు.

"దసరా సెలవుల్లో... మీరు తప్పకుండా రావాలి"

"రాకుండా వుండగలనా"

ఆమె చేతిని పెదవుల దగ్గరకు తెచ్చుకో బోయాడు.

'యే అక్క... అదుగో...' లత కంగారుగా అంది

కమలాకరం చటుక్కున చెయ్యి వదిలాడు

లత కిలకిలా నవ్వింది.

"ఏయ్..." లత వెళ్ళ బోయింది.

"రేపు నేను వెళ్ళే లోగా మరొక సారి రావాలి"

"అలాగే" అంటూ లత వెళ్ళి పోయింది.

కమలాకరం మనస్సు తీయని అనుభూతితో నిండి పోయింది.

"లత నన్ను ప్రేమిస్తోంది... సందేహం లేదు..." అనుకున్నాడు.

కమలాకరం ద్విగుణీకృతోత్సాహంతో విజయవాడకు తిరిగి వచ్చాడు.

* * *

"కమలాకరం! మావయ్య నీకో మంచి సంబంధం తీసుకొచ్చాడురా" తల్లి మాటలకు ముఖం చిట్లించాడు.

"వాళ్ళది మంచి కుటుంబం... అమ్మాయి బాగా వుంటుందిట."

"అమ్మా! నేను ప్రస్తుతం ఎం.ఫిల్ చేస్తున్నాను పి.హెచ్‌డి పూర్తయితే గాని చేసుకోను"

తండ్రి కల్పించుకున్నాడు.

"నువ్వు చెప్పే కారణం ఏ మాత్రం బాగా లేదురా, పెళ్ళి చేసుకుని కూడా డాక్టరేట్ చేయొచ్చు. దానికి పెళ్లి అడ్డు కాదు..."

తన మనసులో విషయం చెప్పాలని నోటి వరకూ వచ్చింది. కానీ లతతో మరో సారి మాట్లాడి నిర్ణయం తీసుకోవాలను కున్నాడు. ఆమె మాటల్లో తనపై ప్రేమ భావం వున్నట్లు ద్యోతకమవుతోంది. కానీ ప్రత్యక్షంగా ఆమెతో ఆ విషయం గురించి మాట్లాడలేదు. మనసు విప్పి అభిరుచులను అభిప్రాయాలను పంచుకోలేదు. దసరాకు వెళ్ళినప్పుడు ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలి. ఆ తర్వాత తనవాళ్ళతో తన గురించి చెప్పి పెళ్ళికి ముహూర్తం పెట్టించుకోవాలి అనుకు న్నాడు.

"కనీసం అమ్మాయిని చూడరా" తల్లి బతిమిలాడింది. అమ్మాయి పేరు మాధవిట. పేరులానే అమ్మాయి కూడా బాగుంటుందిట. మరిదిగారూ! మంచి అవకాశం వదులు కోకండి వదిన నవ్వుతూ అంది.

లత కంటె ఎవ్వరూ అందంగా వుండరు. అనుకున్నాడు. పెళ్ళి చూపులకైనా తీసుకెళ్లాలని అందరూ ఎంతో ప్రయత్నించారు. కానీ కమలాకరం తన అభిప్రాయం మార్చుకోలేదు. తను లతని తప్ప వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకోడు. ఇక అటు వంటప్పుడు వేరే అమ్మాయిని చూడడం ఎందుకు?

ఇంకా ఇరవై రోజుల్లో దసరా సెలవులు ఇస్తారు. విశాఖపట్నం వెళ్లాలి, లత నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది. అనుకున్నాడు. ఇంట్లో వాళ్ళు కమలాకరం మొండి వైఖరికి విసిగి ఊరుకున్నారు.

* * * *

పదిహేను రోజుల తర్వాత- వుదయంవేళ... కమలాకరం కాలేజికి వెళ్ళ బోతుండగా... జానకి సూట్‌కేస్‌తో వచ్చింది.

"అక్కా ఏమిటీ అకాల ఆగమనం" నవ్వుతూ ఆమె చేతిలోని సూట్ కేస్ అందుకున్నాడు.

"నేను తిరుపతి నుండి వస్తున్నారా"

"తిరుపతా"!

"అవున్రా పెళ్ళి కెళ్ళాను"

కమలాకరం ఆ రోజు ఏ క్లాసులు వున్నాయో చూసుకుంటున్నాడు.

"ఎవరిదక్కా పెళ్ళి?" యథాలాపంగా అడిగాడు?

"ఇంకెవరిది' నీకు తెలిసిన అమ్మాయే... లతది."

బాంబు పేలినట్లు చలించి పోయాడు.

"లత పెళ్ళా?"

'అవున్రా"

చటుక్కున ముందు కొచ్చి అక్క భుజాలు పట్టుకుని. ఆమె కళ్లల్లోకి చూస్తూ

## దృశ్యం

హెలెన్ కెల్లర్‌ను ఓ రోజు ఒక మిత్రురాలు అడిగింది—

"అత్యంత దురదృష్ట వంతుడైన మనిషి ఎవరు?

"కళ్ళుండీ చూడలేనివాడు— చూసిన దృశ్యం ఇచ్చే అనుభూతిని పొందలేనివాడు!"

— కొడిమెల శ్రీరామమూర్తి

"నిజంగా" అడిగాడు... కమలాకరం చేతులు తోసేసి విసురుగా లేచింది.

"ఎందుకింత ఆశ్చర్యంరా' నువ్వు కాదన్నంత మాత్రాన ఇక ఆ అమ్మాయికి పెళ్లే కాదా?"

కమలాకరం అయోమయంగా చూశాడు.

"నేను కాదన్నానా ఎవరితో"

"ఆ అమ్మాయి తండ్రికి కాకినాడ ట్రాన్స్‌ఫరయింది. మావయ్యా- వీళ్ళూ వుండేది ఒకే వీధిలో... మావయ్యకి వీళ్ళతో పరిచయమై... ఈ సంబంధమే మీకు రాశాట్ట. కానీ నువ్వు రీసెర్చి పూర్తయ్యే వరకూ చేసుకోనన్నావుట. కనీసం అమ్మాయిని చూడటానికైనా ఇష్టపడ లేదుట.. ఫోటో చూపినా చూడలేదుట. అది తెలిసి లత చాలా బాధ పడింది. ఆ అమ్మాయి నిన్ను మనసారా ప్రేమించింది. నువ్వూ తనని ప్రేమించావను కుంది. పిచ్చి పిల్ల. ఇక నువ్వు తనని చేసుకోడానికి ఇష్ట పడడం లేదని తెలిశాక తప్పని సరిగా మరో సంబంధం చేసుకుంది."

జానకి ఏం చెబుతోందో కమలాకరానికి అర్థం కాలేదు.

"అక్కా మావయ్య చెప్పిన అమ్మాయి పేరు మాధవి కదా!"

'అవున్రా ఆ అమ్మాయి పూర్తి పేరు మాధవీలత!"

అది వినగానే ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది.

కాల చక్రం ఆగి పోయింది.

దుఃఖం బాధ మనస్సుని పెనవేయగా శరీరం స్తబ్దమైంది. సోఫాలో అచేతనుడై పడి పోయాడు కమలాకరం!

* * * *

ఆనాడు తను చేసిన పొరపాటుకు జీవితకాలం శిక్ష అనుభవించాడు. మానసికంగా చచ్చి యాంత్రికంగా జీవితం గడిపాడు.

కానీ తనకొడుకు అటువంటి బాధ అనుభవించకూడదు.

వాడి జీవితం ఆనందమయం కావాలి!

మాధవీలతని ఆనాడు తను పెళ్ళి చేసుకోవాలను కున్నాడు. కానీ ఈ రోజున ఆమెతో వియ్యమంద బోతున్నాడు.

ఎంత చిత్రం...

ఇన్నాళ్ళ తర్వాత మళ్లీ ఆమెని చూడ బోతున్నాడు.

ఇప్పుడు ఆమె తనతో ఏం మాట్లాడుతుందో?

తను మాత్రం ఆమెని ముందుగా క్షమాపణ వేడుకోవాలి.

ప్రస్తుతం ఇద్దరూ ఒంటరి వాళ్ళే. ఈ జీవన సంధ్యలో ఇద్దరూ బంధువులు మాత్రమే కాదు మంచి స్నేహితులు కూడా అవబోతున్నారు.

పాతి కేళ్ళ క్రితంవలె ఈనాడు కూడా మాధవీలతని త్వరగా చూడాలని వుత్సాహపడ్డాడు కమలాకరం!

* * * *

నాలుగు రోజులతర్వాత.

రమేష్ వాడి పోయిన ముఖంతో తండ్రి దగ్గరకు వచ్చాడు.

"రమేష్! అలా వున్నావే, అన్నట్లు నీ ఫ్రెండుని, వాళ్ళ అమ్మగార్ని మనింటికి తీసుకొస్తా నన్నావుగా"

"నాన్నా ఆ అమ్మాయి ఇక నాకు కనబడదు". రమేష్ బాధగా అన్నాడు

"అదేం?"

'రెండ్రోజుల క్రితం వాళ్ల అమ్మగారిని కలిసి మన వివరాలు చెప్పాను. ఇవ్వాళ ఆ అమ్మాయి ఉత్తరం రాసి పంపింది చూడు!" అంటూ రమేష్ తండ్రి కొక కాగితం అందించాడు.

కమలాకరం చదివాడు

డియర్ రమేష్

నువ్వు నీ కుటుంబ వివరాలను చెప్పినప్పటి నుండి అమ్మ మనసు మారి పోయింది. మన సంబంధానికి ఇష్టపడడం లేదు. తండ్రి లేని నన్ను అమ్మ ప్రాణ సమానంగా ప్రేమించి పెంచింది. ఆమెని కష్ట పెట్టలేను. అందుకే అమ్మ కోరికపై నీకు దూరంగా వెళ్ళి పోతున్నాను. ఇక నిన్ను జీవితంలో చూడలేను.

గుడ్‌బై డియర్

నీ శిరీష.

చదివి కమలాకరం బరువుగా నిట్టూర్చాడు. మాధవీలత తనతో సంబంధానికి ఒప్పుకోలేదు. రమేష్ నా కొడుకని తెలిశాకే ఆవిడ మారిందిట.

ఎందుకని?

ఒకప్పటి ప్రేమికుడ్ని ఇప్పుడు వియ్యంకుడి స్థానంలో చూడలేకా? లేక తను ఆనాడు ఆమెని మోసం చేశానని కోపమా?

ఏదైతే ఏం!

తన కొడుకూ తనలా ప్రేమోపహతుడు. వాడూ మనసు చంపుకుని మరమనిషిలా జీవించక తప్పదు.